ముగ్గురు పోటీ

బొమ్మిడి అచ్చారావు

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ శవాన్ని పరిశీలనగా చూశాడు.

హతుడికి యిరవై రెండేళ్ళుండవచ్చు. ఒంటిమీద ఎక్కడా చిన్న గాయం కూడా కనిపించటంలేదు. ఇంకా నిద్రపోతున్నట్టే వున్నది ముఖం!

కాని అతని ఊపిరి నిలిచిపోయి చాలా సేపయిందన టానికి నిదర్శనంగా రిగర్ మర్టిస్ ప్రారంభమయింది.

శ్రీనివాస్ అయిస్‌గడ్డలా తగిలిన చేతిని అలాగే వదిలి, లేచి నించుని చుట్టుపక్కల యేవైనా ఆధారాలు దొరుకుతాయేమోనని పరీక్షగా చూస్తున్నాడు.

వేలిముద్రల నిపుణుడు, ఫోటోగ్రాఫరు తమ పనుల్లో నిమగ్నమయి వున్నారు.

సమయం ఉదయం పదిగంటలు కావస్తోంది. యెండా కాలపు ఎండ చుర్రుమనిపిస్తోంది.

అప్పటికే గవర్నమెంటు పాథాలజిస్టు తన ప్రాథమిక పరీక్ష పూర్తిచేశాడు. శ్రీనివాస్ ప్రశ్నార్థకంగా

చూశాడు.

"నా ఊహ నిజమైతే హతుడ్ని, నరంలోనికి సైనేడ్ యింజెక్టు చేసి చంపేశారు. శరీరం నీలిరంగుకి తిరగటం గమనించారా?" అన్నాడు డాక్టరు శ్రీనివాస్ వంక తిరిగి.

శ్రీనివాస్ తలూపాడు. "టైం చెప్పగలరా?" అన్నాడు.

డాక్టరు రెండు క్షణాలు యేదో గుణించుకుని, "తెల్లవారుఝామున రెండు, మూడు గంటల మధ్య కావచ్చు!" అన్నాడు.

శ్రీనివాస్ తలూపి, "చంపేశారు అని ఖచ్చితంగా ఎలా చెప్పగలరు? హతుడు సైనేడ్ తనే యింజెక్టు చేసుకుని వుండొచ్చుకదా!?" అన్నాడు.

"ఎంతో అనుభవముంటేనేగాని స్వంతంగా ఇంట్రా పనస్ యింజక్షన్ చేసుకోవటం సాధ్యంకాదు. హతుడు ఇంకా యవ్వన ప్రాంగణంలో వున్న కుర్రవాడు. వైద్య పరిజ్ఞానమున్నవారైతే సెల్ఫ యింజక్షన్ సాధ్యమే!"

శ్రీనివాస్ ఆయన చెప్పిన విషయాలు జాగ్రత్తగా మననం చేసుకున్నాడు. పరిసరాలు పరిశీలనగా చూశాడు.

సిటీకి పదికిలోమీటర్ల దూరంలో వున్న ద్రాక్షతోట అది! దాని యజమాని యూసుఫ్. అతనికి ఉదయం తొమ్మిది గంటలకి తన తోటలో శవం కనిపించగానే హడావిడిగా శ్రీనివాస్‌కి ఫోన్ చేసి తెలియపరిచాడు. శ్రీనివాస్ వెంటనే తన బలగంతో రంగంలోకి దిగాడు.

యూసుఫ్‌ని ప్రశ్నించినా పెద్దగా ఉపయోగపడే సమాచారం దొరకలేదు. రాత్రి సమయంలో అక్కడ కాపలావుండే వాచ్‌మన్ కూడా, ఆ శవం అక్కడికి

యెప్పుడు యెలా వచ్చిందీ చెప్పలేకపోయాడు. అక స్మాత్తుగా తమ తోటలో శవం కనిపించటం వింతగా, ఆశ్చర్యంగా వున్నదని చెప్పాడు.

శ్రీనివాస్, శవానికి నాలుగడుగుల దూరంలో పడి వున్న వస్తువును పైకి తీశాడు.

అది ఇంకు పెన్ను. చైనా యూత్ కంపెనీది!

శ్రీనివాస్ వేలిముద్రల నిపుణుడ్ని పిలిచి దానిమీది వేలిముద్రలకోసం ప్రయత్నించమన్నాడు. తర్వాత దాన్ని తన జేబులో భద్రపరిచాడు.

శవం పర్సు జేబులో దొరికిన ఫీజు రశీదునిబట్టి అతను సైన్సు కాలేజిలో బి.యస్సి. ఫైనలియర్ చదువుతున్నట్టు, పేరు రమేష్ అనీ గ్రహించాడు శ్రీనివాస్. ఆ వున్రా దెవరైనదీ ఆయనకీ తెల్సుకోవటం కష్టంకాదు!

శ్రీనివాస్కి అది హత్యేనని తెలిసిపోతూనే వుంది! ఆత్మహత్య చేసుకునేవాడు యింత దూరం రానవసరం లేదు. హాయిగా, తన యింట్లోనే విషం తాగి చచ్చివుండే వాడు. విషం యింజక్టు చేసుకోడు! కావాలనే ఎవరో చేసిన పని యిది! ప్రాణంతీసి ఆ తర్వాత జాగ్రత్తగా తీసుకొచ్చి యీ తోటలో పారేసిపోయాడు!

శ్రీనివాస్ ఆలోచిస్తూ నిల్చుండిపోయాడు.

సార్జంట్ శివం "మార్చ్యురీకి తరలించమంటారా సార్?" అని అడిగేవరకు యీ లోకం లోనికి రాలేదు.

మౌనంగా తలాడించాడు.

* * *

"రమేష్ నిన్న రాత్రి రెండో ఆట సినిమాకు వెళ్తానని చెప్పి పోయాడట సార్ యింట్లో! రాత్రంతా రాకపోయేసరికి అతని తల్లి టూ టౌన్ స్టేషన్లో పోలీసు

రిపోర్టిచ్చిందట! మార్చ్యురీ దగ్గర పాపం, రమేష్ తల్లి నేలమీద పొర్లి యేడుస్తూంటే చూడలేకపోయాను సార్....!" సార్జంట్ రాజు చెప్పాడు.

ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రాజువంక చూసి, "రమేష్ ఒక్కడే వెళ్ళాడో, వెంట ఎవరైనా వున్నారో అడిగావా?" అన్నాడు.

"ఒక్కడే వెళ్ళాడట సార్! అతని స్నేహితుల వివరాలు కూడా సేకరించాను. ఇదిగో సార్ లిస్టు!" శివం ఓ లిస్టు అందించాడు.

"మీరిద్దరు వెళ్ళి రమేష్ చదువుతున్న కాలేజిలో అతని గురించి, అతని నడవడిక గురించి, అతని శత్రువుల గురించి, ఈ మధ్య అతనెవరితోనైనా గొడవలుపడితే ఆ వివరాలు అన్నీ సేకరించుకుని రండి! చాలా జాగ్రత్తగా ప్రతి చిన్న విషయమూ రికార్డు చేసుకోండి!" అన్నాడు శ్రీనివాస్ రాజు, శివంలవంక హెచ్చరిస్తూనట్టు చూసి.

ఇద్దరు శాల్యూట్ చేసి వెళ్ళిపోయాక, యేదో నంబరు రింగ్ చేయబోయాడు శ్రీనివాస్, కాని యెంగేజ్డ్ కావటంతో రెస్టుమీద రిసీవర్ పెట్టేశాడు.

ఆ మరుక్షణం ఫోన్ గణగణ మోగింది.

శ్రీనివాస్ అందుకుని, "హల్లో, క్రైం బ్రాంచ్!" అన్నాడు.

అవతల్నుంచి యెవరో చాలా ఆత్రుతగా ఫోన్ చేస్తున్నారు. "మీరు వెంటనే శారదానగర్ ప్లాట్ నంబర్ నలభై మూడుకి రావాలి. ఇక్కడ ఓ హత్య జరిగింది. అర్జంటు!"

శ్రీనివాస్ ఎలర్టుగా అయాడు కుర్చీలో. వెంటనే లేచి నించుని, "ఎస్ కమింగ్!" అని ఫోన్ పెట్టేశాడు.

సమయానికి సార్జంటులిద్దరు లేరు! హెడ్ క్వార్టర్స్‌కి ఫోన్ చేసి ఫింగర్ ప్రింట్సు ఎక్స్‌పర్టుని, ఫొటోగ్రాఫర్ని, డాక్టర్ని యెక్కడికి పంపవలసిందీ వివరంగా చెప్పి సిబ్బందిని తీసుకుని జీప్‌లో బయల్దేరాడు.

జీప్ శారదానగర్ వైపు పరుగెత్తింది.

2

శారదానగర్ ప్లాట్ నెంబర్ నలభైమూడులోని బెడ్ మీద అచేతనంగా పడివున్న ఆ అమ్మాయి శవం వంక కాసేపు అలాగే చూస్తూవుండిపోయాడు శ్రీనివాస్.

ఆ అమ్మాయి చాలా అందగత్తె. నిండా యిరవై లేవు. నిండు యవ్వనంలో వున్నది! ఎర్రటి శరీరచ్ఛాయ నీలం రంగుకు తిరగటానికి సిద్ధంగా వున్నది!

"సీమ్ కంప్లెయింట్స్! సైనేడ్ ఇంట్రావీనస్ యింజక్షన్!" అన్నాడు డాక్టరు కుడిచేతి వెయిన్ వంక పరీక్షగా చూస్తూ.

శ్రీనివాస్ ఉలిక్కిపడి చూశాడు.

"బహుశా రెండు హత్యలకూ సంబంధముండివుండాలి! ఇది ఆత్మహత్య కాకటాని కవకాశముందంటారా డాక్టర్?" అన్నాడు.

"ఇందాకటి కేసులాంటిదే కదా! యెడమచేత్తో కుడిచెయ్యి నరంలోకి యింజెక్టు చేసుకోవటం అంత తేలికైన విషయం కాదు! దానికి చాలా ప్రాక్టీస్ కావాలి" అన్నాడు డాక్టరు.

"అయితే ప్రాణంపోయి ఎంతసేపయి వుంటుంది?"

"సైనేడ్ ఇంజక్టుచేసిన క్షణాల మీద ప్రాణం పోతుంది. ఇది ఓ గంట క్రితమే జరిగుండాలి! శరీరం వేడిమిని పూర్తిగా కోలుపోలేదు" అన్నాడు డాక్టరు.

గంట క్రితమే జరిగిందంటే, పట్టపగలు యింట్లోకి వచ్చి జాగ్రత్తగా ఇంట్రావీనస్ యింజక్షన్ చేయగలిగేటంత సావకాశం వున్న హంతకుడెవరుంటారు? అంటే, ఆ హంతకుడు హతురాలితో చాలా సన్నిహిత సంబంధమున్నవాడో, చాలా దగ్గరవాడో అయివుండాలి!

శ్రీనివాస్ కన్నీరు మున్నీరుగా విలపిస్తూన్న హతురాలి తల్లిని దగ్గరగా పిలిచాడు.

“ఆ అమ్మాయి పేరేమిటండీ?” అనడిగాడు.

“సరళ!”

“మీ కేమవుతుంది?”

“నా బిడ్డేనండి. పెద్ద కూతురు. దాని తర్వాత ఓ అబ్బాయి పదిహేనేళ్ళవాడు. టెన్త్ చదువుతున్నాడు.”

“మీవారేం చేస్తూంటారు?”

“మెడికల్ రిప్రజెంటెటివ్. రెండు రోజులుగా కేంప్‌లో వున్నారు. టెలిగ్రాం యిచ్చాం.”

“మీ అమ్మాయి చనిపోయి వుండగా ముందుగా ఎవరు చూశారు?”

“నేనే బాబూ! కాలేజినుంచి ఓ గంటన్నర క్రితమే వచ్చి, తల నొప్పిగా వున్నదని పడుకుంది. నేను టీ పెట్టి యిచ్చి, యేదైనా క్రోసిన్‌లాంటి టాబ్లెట్లు తెచ్చిద్దామని రోడ్ మీదికి వచ్చాను. ఇంట్లో ఎవరూ లేరు. మా అబ్బాయి అప్పటికి స్కూలునించి తిరిగిరాలేదు. నేను తిరిగొచ్చేసరికి అమ్మాయి బెడ్ మీద కదలక మెదలక పడివున్నది. నాకు ఆ పడుకున్నతీరు అసహజంగా వున్నట్టనిపించి, కదిపి చూశాను. చనిపోయి వుంది.”

“మీ అమ్మాయిని మీరు బయటకు వెళ్ళిన కొద్దిసేపట్లోనే ఎవరో చంపి వుంటారనుకున్నాను, అవునా?”

"అవునండి!"

"చంపారని ఎలా అనుకున్నారు?"

"అమ్మాయి చేతినుంచి రక్తం కారుతోంది. చూశాను. నరం దగ్గర్నుంచి రక్తం వస్తోంది. కింద పగిలిపోయిన సిరంజ్ ముక్కలు కనిపించాయి. పక్క యింటివాళ్ళు ఎవరో పాతికేళ్ళ కుర్రాడు నేను బయటికి వెళ్ళాక హడావిడిగా లోపలికొచ్చి, అంత హడావిడిగాను వెళ్ళి పోయాడని, బహుశా అతను మా అమ్మాయి ఫ్రెండు కావచ్చునని, అనుమానించలేదనీ చెప్పారు. దాన్నిబట్టి అమ్మాయిని యేదో యింజక్షనిచ్చి చంపేశాడని నిర్ణ యించుకున్నాను."

శ్రీనివాస్ ఆమె చాలా తెలివైనదని గ్రహించాడు.

"మీరు కరెక్టుగా ఊహించారు. మీ పక్కింటి వాళ్ళను, అదే ఆ యువకుడ్ని చూసిన వాళ్ళను, యిలా పిలుస్తారా?" అడిగాడు.

అయిదు నిమిషాల తర్వాత ఓ నడివయసామె లోపలి కొచ్చి నిల్చుంది.

"అమ్మా. మీరు ఎవరో అబ్బాయి ఇంట్లోకి రావటం, మళ్ళీ వెళ్ళిపోవటం చూశారట కదా! ఆ అబ్బాయిని వర్ణించగలరా?"

"నేను ప్రత్యేకంగా గుర్తుపెట్టుకోలేదు బాబూ! నల్లగా తుమ్మ మొద్దులాగా వున్నాడు. మోటరుసైకిలు మీద వచ్చాడు. చేతిలో చిన్న పెట్టెలాంటిది వున్నది! అయిదు నిమిషాలు కూడా కాకుండానే బయటికొచ్చి మళ్ళీ మోటారుసైకిలుమీద హడావిడిగా వెళ్ళిపోయాడు. చూస్తే గుర్తుపట్టగలనేమో....!" అన్నదామె.

"ఇదివరలో ఆ కుర్రాడు యింటికి రావటం మీరు

చూశారా?"

"లేదండి. చూస్తే గుర్తుపట్టి వుండేదాన్ని!"

"సరే, మీరు వెళ్ళండి!" అన్నాడు శ్రీనివాస్.

తర్వాత, సరళ తల్లివైపు తిరిగి, "మీ అమ్మాయికి మగ స్నేహితులెవరున్నారో చెప్పగలరా?" అన్నాడు.

"నాకు తెలిసి దానికి అబ్బాయిలెవరూ స్నేహితులు లేరండి. విద్య, విశాల, మనోరమ—అనే ముగ్గురు స్నేహితురాళ్ళు మాత్రం వున్నారండి!"

"వాళ్ళ అడ్రసులు చెప్పండి!"

ఆమె చెప్పింది. శ్రీనివాస్ నోట్ చేసుకున్నాడు.

"మీవారు రాగానే స్టేషన్‌కోసారి రమ్మని చెప్పండి! పోస్టుమార్టంకాగానే మీ అమ్మాయిని అప్పగిస్తాం. మీకు యేవైనా విషయాలు మాకు చెప్పవలసినవి గుర్తొస్తే నాకు ఫోన్ చెయ్యండి" అన్నాడు.

3

సార్జంటు శివం రమేష్ స్నేహితుల వివరాలు సేకరించుకువస్తే, సార్జంటు రాజు అతని విరోధుల వివరాలు తెల్సుకుని వచ్చాడు.

"ఈమధ్య నరేష్ అనే కుర్రాడితో రమేష్ కొట్లాడటం జరిగిందట సార్! నరేష్ రమేష్ అంతుచూస్తానని శపథం చేసినట్లు, ఆ విషయాన్ని అంతటితో రాజీ చేయటానికి కొందరు విద్యార్థులు ప్రయత్నించినట్లు తెలిసింది. నరేష్‌కాక అంతకుముందు పార్థు అనే మరో కుర్రాడు కాలేజి ఎలక్షన్ల విషయంలో రమేష్‌తో బాగా ఘర్షణ పడ్డాడట. ఇరు వర్గాలవారు కొట్టుకోవటం, రాజకీయంగా దానికి అనవసరమైన ప్రాధాన్యత నివ్వటం జరిగింది.

"ఇంకో యింట్రెస్టింగ్ సంగతేమిటంటే, సరళ—అదే రెండో కేసులో హంతకురాలు రమేష్ ప్రియురాలు. ఆమె రమేష్ని యిష్టపడటం ఓర్వలేని ఆమెని ప్రేమించిన యిద్దరు కుర్రాళ్ళు రమేష్కోసం వలవేసుకుని వున్నారు. వాళ్ళ పేర్లు గిరి, గోపాల్రావు. ఇవిగో వాళ్ళ అడ్రసులు. వీళ్ళందరు క్లాస్మేట్స్ కావటం విశేషం!" అన్నాడు రాజు.

శ్రీనివాస్ వాళ్ళ పేర్లు, విలాసాలు చూసి తల పంకించాడు. "గుడ్! సరళ కేసుతో రమేష్ కేసు కేదైనా కనెక్షనుందా అనుకున్నాను. లింక్ అందింది. బహుశా హంతకుడు కూడా ఒకడే కావచ్చు. యెందుకంటే రెండు కేసుల్లోను సైనేడ్ నుపయోగించటం జరిగింది. విద్య, విశాల, మనోరమ అనబడే ముగ్గురు స్నేహితురాళ్ళున్నారు సరళకు. వాళ్ళకు సరళ అంతరంగిక విషయాలు తెలిసే వుంటాయి. సరళ కేసు ముందుకు నడవటానికి వాళ్ళు చెప్పే విషయాలు ఉపకరిస్తాయి.

నరేష్, పార్థు, గిరి, గోపాల్రావు వీళ్ళ నలుగురి ఎలిబీలు బాగా పరిశీలించి, రమేష్ హత్య జరిగిన రాత్రినుంచి మర్నాటి ఉదయంవరకు వాళ్ళు యెక్కడెక్కడ తిరిగిందీ వివరాలు సేకరించండి."

వాళ్ళిద్దరు వెళ్ళిపోయారు. శ్రీనివాస్ సరళ హత్య గురించి డాక్టరు యిచ్చిన పోస్టుమార్టం రిపోర్టు వివరాలు పరిశీలిస్తుండగా ఫోన్ మోగింది.

"హల్లో, క్రైంబ్రాంచ్!" అన్నాడు రిసీవర్ ఎత్తి.

"రమేష్ను హత్యచేసిందెవరో తెలుసుకోవాలని వుందా?" అన్నది అవతలి కంఠం.

శ్రీనివాస్ ఉలిక్కిపడి కుర్చీలో సర్దుకుని కూచు

న్నాడు.

"ఆఁ, ఎవరు?" అన్నాడు తొందర తొందరగా.

"నరేష్!" అన్నది అవతలి కంఠం.

"హలో, మీరెవరు? యెక్కడ్నుంచి మాట్లాడు న్నారు?" శ్రీనివాస్ అడుగుతుండగానే అవతల ఫోన్ క్లిక్ మని వినిపించింది.

"హల్లో, హల్లో" అంటూనే వున్నాడు శ్రీనివాస్. ఫోన్ క్రేడిల్ చేస్తూ ఆలోచనలో పడ్డాడు.

ఇంతలో మళ్ళీ ఫోన్ మోగింది. వెంటనే ఎత్తాడు.

"హల్లో, క్రైం బ్రాంచా?" అన్నారెవరో అవతలున్నుంచి.

"ఎస్ ప్లీజ్, మీరెవరు?" అడిగాడు శ్రీనివాస్.

"ఇనస్పెక్టర్ శ్రీనివాస్ కావాలి!"

"మాట్లాడుతున్నాను."

"రమేష్ నెవరు చంపారో తెలుసుకున్నారా?"

"లేదు. మీకు తెలుసా?"

"తెలుసు."

"ఎవరు?"

"సురేష్ మాత్రం కాదు!"

"మరెవరు?"

"పార్ధు!"

"ఈజిట్? మీరెవరు? అతనే హంతకుడని ఆధారాలున్నాయా?"

"అది మీ పని!"

"హల్లో మీరు...." శ్రీనివాస్ మాటలు పూర్తి కాకుండానే అవతల ఫోన్ పెట్టేశాడతను.

శ్రీనివాస్ తల విదిలించాడు. ఏమిటీ ఫోన్ కాల్స్

ఎవరు చేస్తున్నారు? రెండు ఫోన్స్ ఒకరు కాదు చేసినది? వేరు వేరు కంఠాలు!

మూడోసారి ఫోన్ మోగుతుండగానే ఎత్తి "హల్లో క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతున్నాను" అన్నాడు వెంట వెంటనే.

ఫోన్‌లో నవ్వు వినిపించింది. "ఏమిటి సార్, అంత హడావిడి?" అన్నది అవతలి కంఠం.

"మీరెవరు? మీరు చెప్పాలనుకున్నదేమిటి?"

"రమేష్ హంతకుడి గురించి!"

"ఎవరు, చెప్పండి?"

"గిరి!"

"గిరా? ఎవరు మీరు?"

"మీ శ్రేయోభిలాషిని!" ఫోన్ పెట్టేసిన చప్పుడు.

శ్రీనివాస్‌కి ఆ ముగ్గురు వ్యక్తులమీదా బాగా కోపం వచ్చింది. ఎవరో పేరు చెప్పకుండా తనతో జోక్ చేస్తున్నారు. ఎవరు వాళ్ళు?

మళ్ళీ ఫోన్ మోగింది. ఎత్తకూడదనే అనుకున్నాడు. కాని అతని చేతులు అప్రయత్నంగా రిసీవర్‌ని అందుకున్నాయి.

"హల్లో ఎవరు మాట్లాడేది?"

"ఇనస్పెక్టర్ శ్రీనివాస్‌గారేనా మాట్లాడేది?"

"ఎస్, నేనే!"

"రమేష్ హత్య విషయం నాకు తెలిసిన వివరాలు చెప్పాలని ఫోన్ చేశాను."

"ఏమిటి, చెప్పండి!"

"రమేష్‌ని గోపాలరావు చంపేశాడు."

"వాట్?"

"అవును మిస్టర్ ఇనస్పెక్టర్! వాకబు చెయ్యండి!"

"మీ రెవరు? ఎక్కడ్నుంచి?"

"ఆ వివరాలు అనవసరమనుకుంటాను" ఫోన్ పెట్టేశాడు అవతలి వ్యక్తి.

శ్రీనివాస్ రిసీవర్ క్రేడిల్ చేసి, తల పట్టుకున్నాడు. అనుమానితులు నలుగురు. వాళ్ళ పేర్లు ఫోన్‌లో నలుగురు వ్యక్తులు చెప్పారు. ఒక గొంతుకి రెండో గొంతుకి ఎక్కడా పోలిక లేదు. వేర్వేరు వ్యక్తులు చేశారన్నది నిర్వివాదాంశం.

మళ్ళీ ఫోన్ మోగింది. శ్రీనివాస్‌కి చాలా కోపంగా వుంది. కోపంగా ఎత్తాడు.

"హల్లో, ఇనస్పెక్టర్ శ్రీనివాస్‌గారా?" అన్న ఆడగొంతు విన్పించగానే సర్దుకుని, "ఎస్. మీ రెవరు?" అన్నాడు.

"నేను యెవరైతేనేం లెండి, సరళను హత్య చేసిం దెవరో చెప్పమంటారా?" అన్నది అవతలి స్త్రీ.

శ్రీనివాస్‌కి పిచ్చికోపం వచ్చింది. రమేష్ వాంతకుడి గురించి చెప్పినట్టే యిప్పుడు సరళ గురించి యీ ఆడపిల్ల లెవరో కాల్స్ మొదలెట్టారని అర్థం చేసుకున్నాడు. చటుక్కున ఫోన్ పెట్టేశాడు!

అతనికి చాలా కోపంగా వుంది. పోలీసు డిపార్టు మెంటుపట్ల ప్రజలకు సదభిప్రాయం లేదు. చివరకు ఫోన్ కాల్స్ చేసి తమని ఆటపట్టించటంవరకు వచ్చిందన్నమాట!

మళ్ళీ ఫోన్ మోగింది. శ్రీనివాస్ చాలాసేపు రిసీవర్ ఎత్తలేదు. అతనికి తెలుసు, ఆ ప్రాక్టికల్ జోకర్సు యెవరో మళ్ళీ చేస్తున్నారని! ఫోన్ మోగటం ఆగిపో యింది. రెండు క్షణాల తర్వాత మళ్ళీ మోగింది. అప్పుడూ

ఎత్తలేదు శ్రీనివాస్.

ఫోన్ అలా మోగుతూనే వుంది!

శ్రీనివాస్ చాలా కోపంగా ఎత్తి టేబిల్ మీద పెట్టేశాడు రిసీవర్. హలో, హలో అని చాలా గట్టిగా వినిపిస్తోంది.

అయినా శ్రీనివాస్ అలాగే వదిలేశాడు. కానిస్టేబుల్ని పిలిచి, "ఆ కాల్ ఎక్కడ్నుంచి వస్తున్నదో టాప్ చేసి యిన్ఫర్మేషన్ యిమ్మని కంట్రోల్ రూం టెలిఫోన్ ఆపరేటర్ కి చెప్పు!" అన్నాడు.

కానిస్టేబిల్ వెళ్ళిపోయాడు.

ఫోన్ లో ఎవరిదో కంఠం చాలా కోపంగా, కర్కశంగా వినిపిస్తోంది. ఆ వ్యక్తిని మాటల్లో పెట్టి సంభాషణ పొడిగించాల్సిన అవసరముందని శ్రీనివాస్ గుర్తించాడు. రిసీవర్ ఎత్తి "హల్లో!" అన్నాడు.

"హూ యీజ్ స్పీకింగ్!" అన్న గొంతు చాలా అధికారయుతంగా, కఠినంగా విన్పించింది. ఆ గొంతు కమిషనర్ అని గుర్తించగానే వెంటనే ఆటెన్షన్ లోకి వచ్చేశాడు శ్రీనివాస్.

"అయామ్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ స్పీకింగ్ సర్!" అన్నాడు.

"ఏమయ్యా ఎంతసేపట్నుంచి పిలుస్తున్నాను? స్టేషన్లో అందరూ ఏమయ్యారు? ఐ విల్ టేక్ డిసిప్లిన్ ఏక్షన్ అండ్ సస్పెండ్ యూ ఆల్!" అగ్ని హోత్రుడిలా విరుచుకు పడ్డాడు కమిషనర్.

శ్రీనివాస్ ఫోన్ లో యెంతో ప్రాధేయపడగా, కమిషనర్ శాంతించాడు.

"రమేష్, సరళ హత్యల విషయం స్టూడెంట్సులో

పెద్ద సంచలనం రేపింది. మన డిపార్టుమెంటుమీద, మన చేతకానితనాన్ని ఎత్తి చూపుతూ దుమ్మెత్తి పోస్తున్నారు. మూడు రోజులయినా యింకా హంతకుల్ని పట్టుకోలేని మన అసమర్థతను వేలెత్తి చూపుతున్నారు. కళాశాలలు బహిష్కరించాలని, ఆందోళన లేవదియ్యాలని విద్యార్థి సంఘ నాయకులు పిలుపునిచ్చారు. సో ఇన్వెస్టిగేషన్ స్టాండ్స్ ఎట్ వాట్ స్టేజ్?" కమిషనర్ అడిగాడు.

శ్రీనివాస్ అపాలజటిక్ గా, "ఇన్వెస్టిగేషన్ యీజ్ గోయింగాన్ సార్! కాస్త టైం కావాలి!" అన్నాడు.

కమిషనర్ చాలా ఖచ్చితంగా అన్నాడు. "ఎస్పీకి, డిఎస్పీకి, సి.ఐ.జి. అందరికీ యిందాకే పరిస్థితిని గురించి వివరంగా చెప్పాను మీటింగ్ లో. ఆ ఫైలు నువ్వు డీల్ చేస్తున్నట్టు చెప్పారు. ఎనీ వే, కేస్ షుడ్ బి డిస్పోజ్ డ్ టై టూ డేస్!"

"సార్ ...." శ్రీనివాస్ ఏదో చెప్పబోయాడుగాని, యింతలోనే కమిషనర్ ఫోన్ పెట్టేశాడు.

శ్రీనివాస్ నుదురు కొట్టుకున్నాడు. ఈ విద్యార్థులతో ఏదొచ్చినా పట్టలేం. వాళ్ళు తలుచుకుంటే పోలీసు స్టేషన్లు బూడిదచేసి పారేస్తారు! చచ్చిన యిద్దరూ స్టూడెంట్సు కావటం తన కర్మకొచ్చి పడిందనుకున్నాడు శ్రీనివాస్.

శ్రీనివాస్ ఆలస్యం చెయ్యకుండా యేదో నంబరు డయల్ చేసి, "హల్లో, బ్రదర్ కిరణేనా మాట్లాడుతున్నది?" అన్నాడు.

"ఎస్. కిరణ్ స్పీకింగ్!" అన్నాడు అవతలనుండి డిటెక్టివ్ కిరణ్.

4

కిరణ్ కాసేపటివరకు పొట్ట పట్టుకుని నవ్వుతునే వున్నాడు శ్రీనివాస్ అవస్థకు.

శ్రీనివాస్ గుర్రుగా చూశాడు. "నీకు వేళాకోళం గానే వుంటుంది. అవతల కొంపలు మునగబోతున్నాయి. ప్రమోషన్ మాట దేవుడెరుగు, ఉన్న ఉద్యోగం కాస్తా వూడిపోయేలాగా వుంది!" అన్నాడు.

కిరణ్ కూల్‌గా చూసి, "పోనియ్యి, అప్పుడు నాతో చేరి యిన్వెస్టిగేషన్ చేద్దువుగాని!" అన్నాడు.

"ఓహో, నీకు అసిస్టెంటు లేడుకదా, అందుకని...."

కిరణ్ మళ్ళీ నవ్వాడు.

శ్రీనివాస్ చిన్నబుచ్చుకున్నాడు.

కిరణ్ ఓదార్పుగా "ఇలాంటి చిన్న కేసుకి అంత వర్రీ అయిపోతా వేమిటి మైడియర్ ఇన్స్పెక్టర్! కేసు ఫైల్సు యిలా యివ్వు!" అన్నాడు.

శ్రీనివాస్ చకచక ఫైల్సు కిరణ్ కందించాడు.

కిరణ్ ఓ అరగంటవరకు ఫైల్సు పరిశీలనలో మునిగి పోయాడు. తరవాత తలెత్తి శ్రీనివాస్ వంక చూసి, "ఇప్పటివరకు నీ ఫైండింగ్స్ ఏమిటి?" అనడిగాడు.

"సారీ బ్రదర్, ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే వుంది. అనుమానితులు నలుగురికీ బలమైన ఎలిబీలున్నాయి. పైగా స్పాట్‌లో దొరికిన ఆధారాలు హంతకుల్ని ట్రేస్ చెయ్యటానికి యేమాత్రం ఉపయోగపడలేదు!"

"ఏమిటా ఆధారాలు?"

"ఇదిగో యీ యూత్ పెన్ను! పగిలిపోయిన సిరంజి ముక్కలు! ఈ సిరంజి ముక్కలు కెమికల్ ఎనాలిసిస్‌కి

పంపించబడ్డాయి. అందులో సైనేడ్ వుండటం, ఆ సైనేడ్‌తోనే సరళకు విషప్రయోగం జరగటం రుజువయ్యాయి."

"మరి యీ పెన్‌ను కెమికల్ ఎనాలిసిస్‌కి పంపించ లేదా?"

"పెన్నా? ఇది దేనికి? దీనిమీద వేలిముద్రలకోసం ప్రయత్నించాం, దొరకలేదు."

కిరణ్ పెన్ కేప్ విప్పి, నిబ్‌తోబాటు వున్న యింక్ ఫిల్లర్‌ని చూపించి, "ఇందులో వున్నది యింకు కాదు, సైనేడ్!" అన్నాడు.

"వాట్?" శ్రీనివాస్ అదిరిపడి ఆ పెన్ అందుకున్నాడు.

"నొక్కవద్దు. డేంజరస్!" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ తన ప్రయత్నం విరమించుకున్నాడు.

"ఈ పెన్ నిబ్‌లోకి సైనేడ్ ప్రవహిస్తోంది, ఇంక్ ఫ్లో అయినట్టు! నిబ్‌ని శరీరానికి గుచ్చి ఫిల్లర్‌ని నొక్కగానే సైనేడ్ హతుడి శరీరంలోకి యింజక్ట్ అయింది. వెంటనే ప్రాణంపోయుంటుంది."

"మరి దానిమీద వేలిముద్రలు దొరకలేదే!"

"పడకుండా జాగ్రత్త చేసుకున్నాడు. బహుశా గ్లవ్స్ వాడివుంటాడు!"

శ్రీనివాస్ తలూపాడు.

"సిరంజిమీద దొరికాయా ఫింగర్ ప్రింట్సు?" అడిగాడు కిరణ్.

"దొరికాయిగాని, సగం సగం సిరంజి పగిలిపోయింది కదా!"

"సో, నో యూజ్! రెండు కేసుల్లోను కూడా

హంతకుడ్ని పట్టిచ్చే డైరెక్ట్ ఆధారాలు లేవు. మనం యింకా స్తడీవ్ గా స్టడీ చేయాలన్నమాట!" అన్నాడు కిరణ్.

"మరి నాకొచ్చిన ఫోన్ కాల్స్ ఎవరివై వుంటాయి?"

"అది కూడా మనం ఎంక్వయిరీ చెయ్యాల్సి వుంది."

"అయిదో ఫోన్ కాల్ ఎవరో స్త్రీ చేసింది!"

"ఆ నలుగురిలోను యెవరైనా స్త్రీ కంఠాన్ని అనుకరించి ఫోన్ చెయ్యటానికవకాశం లేదంటావా?"

"కావచ్చు, అవకాశముంది!"

"ఆ ఫోన్ చేసినవాళ్ళు అమాయకులు కాదు. నా ఊహ నిజమైతే వాళ్ళకు ఈ హత్యలతో తప్పనిసరిగా కనెక్షన్ ఉండివుండాలి! నిన్ను డైవర్టు చెయ్యటానికి, కేసును కన్ఫ్యూజ్ చెయ్యటానికి వాళ్ళు అలా ఫోన్ చేసి వుంటారు. ఫోన్స్ నాలుగు నలుగుర్నించి కాక పోవచ్చు. ఒక్కడే నాలుగు రకాలుగా, గొంతుమార్చి మాట్లాడి వుండొచ్చు. స్త్రీలా కూడా గొంతు మార్చి చేసి వుండొచ్చు, చూడాలి!"

"ఎక్కడ్నుంచి మొదలు పెడదాం?"

"అసలు ఓసారి రమేష్ వాళ్ళింటికి వెళ్ళొద్దాం. తర్వాత అతని శవం కనిపించిన గ్రేవ్స్ గార్డెన్ కి వెళ్దాం!"

5

"మీ అబ్బాయి చనిపోయిన రాత్రి జరిగిన సంఘటనల గురించి గుర్తు చేసుకుని చెప్పండి!" అడిగాడు కిరణ్.

"గుర్తు చేసుకోవటానికి మరచిపోతే కదా బాబూ, భగవంతుడు యింత చిన్న వయసులో నా బిడ్డను తీసుకుపోయి, ఈ ముసలి వయసులో నాకు గర్భశోకాన్ని

కలిగించాడు" రమేష్ తల్లి గొంతు దుఃఖంలో పూడుకు పోయింది.

కిరణ్ కొద్దినిమిషాలు మౌనం వహించాడు. శ్రీనివాస్ కూడా ఆమెనేమీ ప్రశ్నించలేదు.

"మీకు రమేష్ ఒక్కడేనా సంతానం?" అడిగాడు కిరణ్.

"నాకు యిద్దరు కొడుకులు బాబూ! రమేష్ తర్వాత అబ్బాయి ఇంటర్ చదువుతున్నాడు. వాళ్ళ నాన్నగారికి వచ్చే పెన్షనే మాకు జీవనాధారం! రమేష్ చదువు కుంటూనే ట్యూషన్లు చెప్పి ఎంతో కొంత సంపాదిస్తూండేవాడు. ఇప్పుడా ఆధారం కూడా పోయింది!"

కిరణ్ మనసు ద్రవించింది.

"అంటే హైస్కూలు పిల్లలకు చెపుతుండేవాడా?"

"ఎక్కువగా పబ్లిక్ పరీక్షలకు కూచునే పిల్లలకు అంటే ఏడు, పది తరగతుల పిల్లలకు—చెప్తుండేవాడు. తన క్లాసు పిల్లలకు కూడా అప్పుడప్పుడు యింట్లో కొద్ది గంటలసేపు పాఠాలు చెప్తుండేవాడు."

"తన క్లాసు వాళ్ళకా? ఎవరో చెప్పగలరా?"

"నలుగురు అమ్మాయిలు, పెద్ద కుటుంబాల పిల్లలే వస్తూండేవారు బాబు. వాళ్లకు వివరించి చెపుతుంటే నాగస్వరం వినే పాముల్లాగా ఎంతో శ్రద్ధగా, అణకువగా వినేవారు. బాబు చెప్పే పద్ధతి అలాంటిది!"

"ఆ అమ్మాయిల పేర్లు చెప్పగలరా?"

"విద్య, విశాల, మనోరమ, సరళ!"

శ్రోతలిద్దరు ఆశ్చర్యాన్ని అణచుకుంటూ విన్నారు.

"అయితే ఆ నలుగురు అమ్మాయిలు తప్ప మరెవరూ, అంటే అబ్బాయిలెవరూ వచ్చేవారు కాదా?"

"బాబు ఒప్పుకోలేదు గాని నలుగురైదుగురు రావ టానికి చాలా ప్రయత్నించారు. అమ్మాయిల్ని అల్లరి చెయ్యటానికేగాని నిజంగా చదువుకోవాలని కాదని అబ్బాయి ఉద్దేశం!"

"ఓహో, ఆ అమ్మాయిలు ట్యూషన్ పేర ఏమైనా ఫీజు యిచ్చేవారా?"

"ఇచ్చేవారు బాబూ! వాళ్ళు నలుగురూ రమేష్ క్లాసుమేట్లే బాబూ! అసలు మా పరిస్థితికి జాలిపడే వాళ్ళు మా బాబు దగ్గర ట్యూషన్కి వచ్చి, తమకు చేతనైన సహాయం ఆ విధంగా చేసేవారని నా అను మానం! యెవరైనా ఊరకనే యిస్తే పదిపైసలు కూడా బాబు తీసుకోడు. అతని నైజం వాళ్ళకు తెలుసు!"

"సరళ అంటే రమేష్ ప్రత్యేకమైన శ్రద్ధగాని అభిమానంగాని కనపరచేవాడా?"

"చాలా అభిమానంగా చూసుకునేవాడు. ఆ పిల్ల కూడా 'అన్నయ్యా, అన్నయ్యా' అంటూ వదిలేదికాదు వాడ్ని. నన్ను 'అమ్మా, అమ్మా' అంటూ యెంతో ప్రేమగా, గౌరవంగా మన్నించేది."

కిరణ్, శ్రీనివాస్ ఒకరి ముఖాలొకరు చూసు కున్నారు.

కిరణ్ అడిగాడు. "ఆ అమ్మాయి దగ్గర కూడా ట్యూషన్ ఫీజు తీసుకునేవాడా రమేష్?"

"అసలు ఆ అమ్మాయే ప్రోత్సహించి తక్కిన ముగ్గురు అమ్మాయిల్ని ట్యూషన్కి కుదిర్చింది. అయితే విద్య దగ్గర మాత్రం డబ్బు తీసుకునేవాడు కాదు రమేష్."

"అదేం? ఆ అమ్మాయి ధనవంతురాలు కదా?"

"అది కారణం కాదు బాబూ! ఆ పిల్లంటే వాడికి

వల్లమాలిన ఇష్టం! ఆ పిల్లకైతే వీడు ప్రాణం! కాని వీడు యెన్నడూ హద్దులు దాటలేదు. ఆ పిల్ల నన్ను అత్తా అంటూ వదిలేది కాదు. వీడు మాత్రం అంతస్తుల తారతమ్యాన్ని గుర్తుచేసి ఆమెతో పెళ్ళి కుదరదని ఖచ్చితంగా చెప్పేవాడు. ఆ పిల్లను అనవసరంగా తన మీద ఆశలు పెంచుకోవద్దని చెప్పేవాడు. అయినా వాడి మనసు నాకు తెలుసు!"

"ఇంతకీ అసలు విషయం చెప్పారు కాదు. ఆ రోజు రాత్రి రమేష్ యెక్కడికి వెళ్ళాడు? ఎన్ని గంటలకు యిల్లు వదిలి వెళ్ళాడు?"

"ఆ రోజు ఎన్నడూ లేనిది రెండో ఆట సినిమాకు బయల్దేరాడు. సాధారణంగా సినిమాకు వెళ్ళటమే అరుదు. ట్యూషన్‌తోనే సరిపోతుంది వాడికి. అలాంటిది వాడికెంతో యిష్టమైన పౌరాణిక సినిమా ఆ రోజుతో వెళ్ళిపోతున్నదని బయల్దేరి వెళ్ళాడు. రాత్రి తొమ్మిది గంటలవుతుంది. అదే నా బిడ్డను కడసారి చూడటం!"

"పోలీసు రిపోర్టు ఎప్పుడిచ్చారు?"

"మర్నాడుదయం ఎనిమిదిన్నర గంటలకు! రాత్రిళ్ళు ఎక్కడా వుండడు. అలాంటిది తెల్లవారినా రాకపోవటంతో భయంవేసి టూటౌన్ స్టేషన్‌లో రిపోర్టిచ్చాను.

"మీకు ఎవరిమీదనైనా అనుమానముందా?"

"ఎవర్నని అనుమానించగలను బాబూ! అమ్మాయిలకు ట్యూషన్ చెప్పటంనుంచి, ఆకతాయి కుర్రాళ్ళకు చెప్పక పోవటంనుంచి—వాళ్ళు బాబుమీద చాలా కోపంగా వున్నారు. వాళ్ళలో ఎవరైనా ఈ పని చేసుండవచ్చు."

"వాళ్ళ పేర్లేమయినా చెప్పగలరా?"

ఆమె కొద్ది క్షణాలు ఏదో ఆలోచించి, "పార్థ అని

ఓ కుర్రాడు బాగా పొగరుబోతుగా ప్రవర్తించేవాడు. గిరి అనే కుర్రాడు ఓసారి సరళను ఆటపట్టించబోతే రమేష్ చాలా తీవ్రంగా మందలించి పంపాడు. ఆతర్వాత సరళను బాబును కలిపి చాలా అవమానకరంగా గోడల మీద రాశాడట ఆ గిరి. సరళను రావద్దన్నా ఆ పిల్ల రావటం మానేదికాదు. అలాంటి రాతలు, కూతలు పట్టించుకోకూడదని, మనంతట మనం బయటపడితే మరింత లోకువవుతామనీ ఆ పిల్లే తిరిగి రమేష్‌కు ధైర్యం చెప్పేది!"

"ఇంకా ఎవరైనా వున్నారా....?"

"ఇంకా ఇద్దరు—ముగ్గురున్నారుగాని, పేర్లు తెలియవు బాబూ!"

"అలాగేనమ్మా, చాలా ముఖ్యమైన విషయాలు చెప్పారు. మా పరిశోధనలో చాలా ఉపయోగపడతాయి" అన్నాడు కిరణ్ ఆమెకు కృతజ్ఞతలు చెపుతూ.

"మావాడ్ని చంపినవాడిని మాత్రం క్షమించకూడదు బాబూ! గంగిగోవులాంటి బిడ్డని అన్యాయంగా చంపేశారు. వాళ్ళని ఉరికంబాల కెక్కించండి!" ఆమెలో ఆవేశం అవధులు దాటింది.

ఆమెకు ఊరట కలిగించి బయటికొచ్చారు—కిరణ్, శ్రీనివాస్.

"మీవాళ్ళు సేకరించిన వివరాలు ఇలాగే వుంటాయి. తలా తోకా వుండవు. సరళ, రమేష్ ప్రేమించుకున్నారని, సరళను ప్రేమించిన వ్యక్తులు బహుశా రమేష్‌ని చంపివుండొచ్చనీ మీ వాళ్ళు అభిప్రాయపడ్డారు. కాని అసలు విషయం వేరేలా వుంది. అవునా....?"

"అవును. విద్య, రమేష్ ప్రేమికులు. సరళతో అతనికి సన్నిహిత సంబంధమున్నా, అది వేరే సంబంధం. పవిత్రమైన అన్నా చెల్లెళ్ళ బంధం! దాన్ని మా వాళ్ళు యింకోలా అర్థం చేసుకున్నారన్నమాట! సరే, యిప్పుడు ఎక్కడికి పోవాలి?"

"ఓసారి ఆ ద్రాక్ష తోటకు వెళ్దాం. ఆ తరవాత ఎక్కడికి వెళ్ళాల్సిందీ తరవాత చెపుతాను" అన్నాడు కిరణ్.

6

నేలమీద ఒంగి పరీక్షగా చూశాడు కిరణ్.

మోటరుసైకిలు గురులు స్పష్టంగా కనిపించాయి. శ్రీనివాస్ కిరణ్ చర్యలను గమనిస్తున్నాడు.

కిరణ్ జేబునించి మెజరింగ్ టేప్ తీసి టైరు గురులు కొలిచాడు. "ఇవి బుల్లెట్ టైరు గురులు! హంతకుడు మోటారుసైకిలుమీద హతుడ్ని తీసుకువచ్చి యిక్కడ పడేసివుంటాడు. లేదా హతుడు అతనికి సన్నిహితుడై వుంటే యిక్కడికి మోటారుసైకిలుమీద తీసుకువచ్చి వెన్ను గుచ్చి సైనేడ్ ఎక్కించి చంపేసి వదిలేసి పోయుంటాడు. మొదటి పద్ధతిన హత్యచేసి వుంటాడనే నా అభిప్రాయం!" అన్నాడు.

"అయితే రమేష్ స్నేహితులు లేదా శత్రువులు ఎన్ఫీల్డ్ మోటర్బైక్ వున్న వాళ్ళ గురించి ఎంక్వాయిరీ చెయ్యాలంటావు" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ నవ్వి, "ఇదిగో మోటరుసైకిలు యిక్కడ మలుపు తిప్పుకున్నాడు. అంటే ఎంతో సేపు యిక్కడ హంతకుడు గడపలేదు. ఇలా వచ్చి అలా హతుడ్ని తోటలో పడేసి, అలాగే మలుపు తిప్పుకుని వెళ్ళి

పోయాడు. వాచ్‌మన్‌ను కలుసుకుని మాట్లాడావా?" అన్నాడు కిరణ్.

"ఆఁ! అతను ఎవర్నీ చూడలేదని చెప్పాడు."

ఈలోపల హోటల్ యజమాని యూసుఫ్, మరో వ్యక్తి అక్కడికి వచ్చారు.

"ఈయన ఓనర్. యితను వాచ్‌మన్!" పరిచయం చేశాడు శ్రీనివాస్ వాళ్ళిద్దర్నీ కిరణ్‌కి.

కిరణ్ వాచ్‌మన్‌ని ఉద్దేశించి, "నాలుగు రోజుల క్రితం తెల్లవారుఝామున నీకు మోటరుసైకిలు శబ్దం ఏదీ వినిపించలేదా?" అనడిగాడు.

వాచ్‌మన్ కాసేపు ఏదో గుర్తుచేసుకోవటానికి ప్రయత్నించి, "ఆఁ! అవును సాబ్! రెండు గంటల కే తిరికాడ యేదో సైకిలు మోటరు చప్పుడయింది. యాదొచ్చినాది!" అన్నాడు.

"మరి అది ఎవరిదో, దానిమీద యెవరున్నారో చూడలేదా?"

"చూడలేదు సాబ్" అన్నాడు వాచ్‌మన్.

కిరణ్, శ్రీనివాస్ వంక తిరిగి, "పద వెళ్దాం!" అన్నాడు.

టయోటా ఎక్కి స్టార్టుచేస్తూ అన్నాడు కిరణ్! "సరళ యింటికి దారి చూపించు!" అని.

శ్రీనివాస్ గుర్తులు చెపుతుండగా వారించి, "సిటీ లిమిట్సుకి రానియ్యి. ఇంకా పదికిలోమీటర్లుంది కదా!" అన్నాడు కిరణ్.

* * *

"అమ్మా, మీ అమ్మాయి హత్య విషయంలో మరి కొన్ని వివరాలు కావాలి. చెప్పగలరా?" మర్యాదగా

అడిగాడు కిరణ్.

"అడగండి!" అన్నది సరళ తల్లి.

"మీ అమ్మాయి రమేష్ అనబడే వాళ్ళ క్లాసుమేటు యింటికి తరచు వెళుతుండేదా?"

"తరచు యేమిటి బాబూ, రోజూ వెళ్తూండేది! అతను అమ్మాయి క్లాసుమేటు కావటాన ట్యూషన్ చెప్పించుకునేది. వాళ్ళిద్దరిదీ అన్నా చెల్లెళ్ళ అనుబంధం! కుర్రాడు చాలా బుద్ధిమంతుడు. అందుకే సంకోచించకుండా వెళ్ళనిచ్చేదాన్ని. పాపం, ఆ అబ్బాయినీ చంపేశారట దుర్మార్గులు!"

"మీ అమ్మాయికోసం ఆమె స్నేహితురాళ్ళు మీ యింటికొస్తూండేవారా?"

"వచ్చేవారండి. వాళ్ళు మొత్తం నలుగురు స్నేహితురాళ్ళు. మా అమ్మాయితో బాటు రమేష్ వాళ్ళింటి దగ్గరే పాఠాలు చెప్పించుకునేవారు. వాళ్ళ పేర్లు విద్య, విశాల, మనోరమ."

కిరణ్ సాభిప్రాయంగా చూశాడు శ్రీనివాస్ వంక.

"మరో విషయం అడుగుతున్నందుకు అన్యధా భావించకండి! మీ అమ్మాయి ప్రేమలో పడటంగాని, లేదా యెవరైనా కుర్రాళ్ళు ప్రేమిస్తున్నామని వెంటపడటంగాని అలాంటిదేమైనా...."

"నా కూతురని చెప్పుకోవటం కాదుగాని సరళ నిప్పులాంటి పిల్లండి. ఒకటి రెండుసార్లు దాని క్లాసు మేట్స్ వెంటబడితే మర్యాదగా బుద్ధి చెప్పి వదిలేసిందట. అది మాత్రం నాకు తెలిసి యెవరితోను ప్రేమలో పడలేదు. అంతవరకు కచ్చితంగా చెప్పగలను!"

"మా పక్కింటా మెనోసారి పిలుస్తారా?"

"వుండండి పిలుస్తాను!" అని బయటికి వెళ్ళింది సరళ తల్లి. అయిదు నిమిషాల్లో పక్కింటావిడను పిల్చుకుని వచ్చింది.

"చూడండి, మీరు మోటరుసైకిలుమీద యెవరో కుర్రాడిని చూశారు కదా! వర్ణించగలరా?"

"నల్లగా వున్నాడు బాబూ. గడ్డం మీసం కత్తిరించుకున్నాడు. వయసు దాదాపు పాతికేళ్ళుండొచ్చు!"

"ఆ మోటరుసైకిలు యే కంపెనీదో చెప్పగలరా?"

"మోటరుసైకిళ్ళ గురించి నాకంతగా తెలియదండి! ఎర్రరంగు మోటరుసైకిలు! చాలా కొత్తగా నిగనిగ మెరుస్తోంది!"

"నంబరు గురించి ఏమైనా...."

"అబ్బే, ఆ సంగతులేవీ నాకు తెలీదు బాబూ! సరళ చదువుకుంటున్న పిల్ల కదా! స్నేహితులు యెవరైనా కావచ్చుననుకున్నాను!" అన్నదామె.

"ఆ అబ్బాయి వీళ్ళలో యెవరైనా నేమో చూసి చెప్పండి!" అన్నాడు కిరణ్ నాలుగు ఫోటోలు ఆమె ముందుంచి.

ఆమె కాసేపు పరిశీలనగా ఆ ఫోటోలు చూసి, "అబ్బే వీళ్ళలో యెవరూ కాదండి! ఆ అబ్బాయి మరీ గూండాలాగా వున్నాడు. దుబ్బు జుట్టు. వీళ్ళలా సాఫీగాలేడు!" అన్నది.

"మీరు వెళ్ళొచ్చు. మీరు చెప్పిన విషయాలకు చాలా కృతజ్ఞాలం!" అన్నాడు కిరణ్.

ఆమె వెళ్ళిపోయాక "ఓసారి మీ అమ్మాయి గది పరిశోధించటానికి అనుమతిస్తారా?" అనడిగాడు కిరణ్.

"చూడండి బాబూ!" అన్నది సరళ తల్లి.

కిరణ్ గదిలోనికి ప్రవేశించాడు. లోపల సరళ పుస్తకాల రేక్, చదువుకునే టేబిలు, పక్కనే ట్యూబ్యులర్ మడత మంచం వున్నాయి. అలమరలో ఆమె వాడే చీరలు మడతలు చక్కగా సర్దబడి వున్నాయి. గోడలకి చక్కటి ప్రకృతి దృశ్యాలు పెయింటింగ్ వున్నాయి.

కిరణ్ ఆమె పుస్తకాలను ఒకటొకటిగా పేజీలుతిప్పి చూశాడు. పుస్తకాల్లో యేం కనిపించలేదుగాని ఆమె డైరీలో కొన్ని ఆసక్తికరమైన విషయాలు రాసుకున్నది. ఆ డైరీ తిరగేశాడు కిరణ్.

అందులో రమేష్ గురించి అక్కడక్కడ ప్రస్తావించింది. ప్రతిచోట రమేష్ అన్నయ్య అంటూ రాసుకున్నది. ఆమె మనసుకు ప్రతిబింబమైన ఆ డైరీ ఆమె మనసు స్వచ్ఛతను తెలుపుతోంది.

ఓచోట! విద్య అన్నయ్యను ప్రేమిస్తోంది. కాని అన్నయ్యకు తన అంత స్థేమిటో తనేమిటో తెలుసు. అందుకే తనమీద ఆశ పెట్టుకోవద్దని నన్ను విద్యకు నచ్చ చెప్పమన్నాడు. కాని, విద్యకు నేనేమని చెప్పాలి? నన్నపార్థం చేసుకోమూ!' అని రాసింది సరళ.

మరోచోట, 'విశాల, మనోరమ అన్నయ్య వంక చూసే చూపుల్లో ఆరాధనతో బాటు అర్థంకాని మరెన్నో భావాలు కదలాడటం 'నేను గమనించాను. వాటి భావం నాకు తెలుసు. వాళ్ళిద్దరు, కూడా అన్నయ్యను ప్రేమిస్తున్నారు, అనుమానంలేదు!' అని రాసుకుంది.

ఇంకోచోట, 'మనోరమ విద్యకు అభిప్రాయభేదాలొచ్చాయి. కారణం రమేష్ అన్నయ్య! మనోరమ, విశాలికూడా సరిగా మాట్లాడుకోవటంలేదు. అందరికీ

అన్నయ్య అంటే ప్రేమ, అభిమానం, కాని అన్నయ్యకు యీ విషయాలు పడవు. విద్యపట్ల మొదట్లో కాస్త మొగ్గు చూపినా, ఇప్పుడదిలేదు. నాకులాగే చెల్లెలా చూసుకుంటున్నాడు తప్ప విద్యమీద మరే ఆశలేదు అన్నయ్యకు. వాళ్ళు మాత్రం ఒకరిమీద మరొకరు పోటీపడి ప్రేమించేస్తున్నారు అన్నయ్యను. చివరికిది ఎలా దారితీస్తుందో అర్థంకాదు!' అని రాసింది.

తర్వాత కొన్ని పేజీలు ఖాళీగా వున్నాయి.

ఓ పేజీలో 'ఈ రోజు విద్య, విశాల చాలా పెద్ద ఘర్షణపడ్డారు. విద్య విశాలను కొట్టినంత పనిచేసింది. వాళ్ళను సరిచెయ్యటం మా యిద్దరితరం కాలేదు' అని వున్నది.

తర్వాత పేజీలన్నీ ఖాళీగానే వున్నాయి. ఇంకేం రాసుకోలేదు. తేదీ చూశాడు కిరణ్. సరళ చనిపోవ టానికి రెండురోజులక్రితం వరకు రాసుకుంది. ఆ రెండు రోజులు ఏం రాసుకుని వుండేదో! ఎందుకో ఖాళీగా వదిలేసింది.

సరళ తన గురించి రాసుకున్నది తక్కువే! అక్క డక్కడ తన మనసులో రేగే భావాలు రాసుకుంది.అంతే!

ఇక యేలాంటి సమాచారమూ లభించలేదు ఆమె గదిలో.

సరళ తల్లివద్ద సెలవు తీసుకుని ఇద్దరూ బయటి కొచ్చారు. కిరణ్ టయోటా స్టార్టుచేసి, "స్టేషన్ కి పోనిస్తున్నాను!" అన్నాడు.

7

"హల్లో డియర్, కులాసాగా వున్నావా?" అవతలి నుంచి వినిపించిన గొంతు విని ఆమె టెన్షన్ తో

బిగుసుకుపోయింది.

"ఎవరు నువ్వు? ఏం కావాలి?" ఆమె గొంతు వణికింది.

"నేనెవరో నీకు తెలుసు. నాకేం కావాలో కూడా తెలుసు. నీ రహస్యాలు నా గుప్పెట్లో వున్నాయనీ నీకు తెలుసు. అందుకు పరిహారంగా నేనేం కోరానో నీకు తెలుసు. కాని వీటిని ఎప్పుడు తీరుస్తావో నాకు తెలియటం లేదు."

ఆమె రిసీవర్ని బలంగా పట్టుకున్నా చేతులు వణుకుతునే వున్నాయి.

"ఏం మాట్లాడవు? రమేష్ హత్య గురించి, సరళ హత్య గురించి పోలీసులకి చెప్పేయమంటావా? ఆ రహస్యం తెలిసిన ఏకైక వ్యక్తిని నేను!"

"వద్దు, చెప్పొద్దు."

"మరి నేను చెప్పినట్టు వింటావా?"

ఆమె మాట్లాడలేదు.

"ఆఫ్టరాల్, ఒక్క రాత్రి నువ్వు నాతో గడపటానికి యింత సంకోచిస్తున్నావు. జీవితాంతం ఏ సుఖం లేకుండా కటకటాల వెనక పండంటి జీవితాన్ని బలి చేసుకోదల్చుకుంటే చెప్పు, నీ జోలికి రాను!"

"వద్దు, నాకా నరకం వద్దు!"

"అందుకే నీకు నాకు ఓ చక్కటి పరిష్కారం సూచించాను. నాకు నువ్వు కావాలి. నీ అందం కావాలి. నీతోటి సుఖం కావాలి. ఒక్క రాత్రి నీతో అనుభవం కావాలి. అందుకే యీ తాపత్రయమంతా. తర్వాత నేను ఆ రహస్యం సమాధి చేసేస్తాను—మళ్ళీ నీ జోలికి రాను. నిన్ను కోరను. ఒక్కసారితో నా మోజు తీర్చేసు

కుంటాను. ఏమంటావు?"

"నేను ఆలోచించుకుని చెపుతాను!"

"ఒక్కసారికే నీలో తరిగిపోయేదేమీ వుండదు. ఆ సంగతి నీకు, నాకు తప్ప మరొకరికి తెలియదు. పాపం, తప్పు — అనే భావన నీ మనసులోకి నీ దరిదాపులకీ రానివ్వకు! ఆ తర్వాత అంతా సుఖమే! నీకు నచ్చిన వాడ్ని నువ్వు పెళ్ళిచేసుకో, సుఖపడు!"

"నువ్వు నన్ను తప్ప మరేం కోరినా సంతోషంగా యిచ్చుకుంటాను. డబ్బు కావాలంటే చెప్పు. ఎన్ని వేలు కావాలన్నా యిస్తాను. అంతే కాని కోరకూడనిది కోరకు!"

"కోరకూడనిదేం కోరలేదే! అందరూ చేసేదే! ఇందులో వింతేంలేదే!"

"కాని.... కాని.... నా మనసు...."

"వెధవ మనసుని కాసేపు నోరు మూసుకోమను. ఆ సుఖం ఓసారి మరిగితే నీ మనసు, శరీరం కూడా పదే పదే కావాలంటాయి ఆ సుఖాన్ని. ఏమంటావు? ఎప్పుడు, ఎక్కడకు వస్తావో లేక రమ్మంటావో.... చెప్పాలి!"

"నేను ఆలోచించుకుని చెపుతాను!"

"ఆలోచించుకోవటం దేనికి?"

"మనసును సమాధాన పరచుకోవటానికి!"

"ఆల్ రైట్! యిరవై నాలుగ్గంటలు టైమిస్తున్నాను. నన్ను కాదన్నా, మోసం చెయ్యాలని ప్రయత్నించినా జరగబోయే మరో హత్యకు నేను కారకుడ్ని కాదు! నీ జీవితాన్ని చేజేతులా నాశనమే చేసుకుంటావో, నా దారికొస్తావో నువ్వే నిర్ణయించుకో!"

అవతల ఫోన్ పెట్టేసిన చప్పుడయింది.

ఆమె ఫోన్ రెస్టుమీద పెట్టేసి కొంగుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకున్నది. జగ్ నుంచి మంచినీళ్ళు వంచుకుని గటగట తాగింది.

కుర్చీలో నిస్త్రాణగా వాలిపోయింది.

8

"టైరు గుర్తులు ఫోటోలు తీయించాను. రమేష్ శత్రువుల్లోగాని, మిత్రుల్లోగాని మోటారుసైకిలు—బుల్లెట్ వున్నవాళ్ళు లేరు! గిరికి స్కూటరుంది బజాజ్ చేతక్. గోపాలరావుకి రాజదూత్ వుందిగాని టైరుగుర్తులు టాలీకాలేదు. గుర్తులు ఎన్‌ఫీల్డువన్న విషయంలో అనుమానంలేదు!" అన్నాడు శ్రీనివాస్ కిరణ్‌తో.

కిరణ్ తలూపాడు. ఇద్దరు స్టేషన్‌లో కూచుని చర్చిస్తున్నారు కేసు విషయం!

"హంతకుడికి మోటారుసైకిలుందన్న విషయం నిర్ధారణగా చెప్పలేం. సమయానికి యెవరిదో తీసుకుని వుండొచ్చు, అనుమానం రాకుండా. అయితే సరళను హత్యచేసినవాడు—నరేష్, పార్థు, గిరి, గోపాలరావుల్లో ఎవడూ కాదు. పక్కింటావిడ వీళ్ళ నలుగురి ఫోటోల్ని చూసి కచ్చితంగా చెప్పేసింది కదా! కాకపోతే రమేష్ హంతకుడు, సరళ హంతకుడు ఒకడా కాదా అన్న విషయం తెలిస్తే కేసు మరికాస్త తేలికవుతుంది!"

"రమేష్ హంతకుడి కూడా మోటారుసైకిలుంది కదా! ఇద్దరు ఒకరేనేమో!"

కిరణ్ చురుగ్గా చూశాడు శ్రీనివాస్ వంక.

"మోటారుసైకిలున్న ప్రతివాడూ హంతకుడు కానవసరంలేదు!"

ఇంతలో ఫోన్ మోగింది. శ్రీనివాస్ ఎత్తాడు.

"హల్లో, ఇనస్పెక్టర్ శ్రీనివాస్ గారున్నారా?"

"నేనే నే మాట్లాడుతున్నాను, చెప్పండి!"

"మీకు సరళ హంతకుడి గురించి చెప్పాలి. నే నీ టెన్షన్ భరించలేకపోతున్నాను!" అవతలినుంచి స్త్రీ కంఠం వినిపించింది.

శ్రీనివాస్ ముఖం కోపంతో జేవురించింది. ఫోను పెట్టేయబోతుండగా, కిరణ్ వారించి, "ఇలా యివ్వు!" అన్నాడు.

"ఇదివరకు నాతో ప్రాక్టికల్ జోక్ చేసిన స్త్రీ కంఠమే! నాకు తెలుసు, అందుకే పెట్టేస్తున్నాను" అంటూ ఫోన్ కిరణ్ కందించాడు.

"హల్లో, మీ రెవరు? ఏం చెప్పాలనుకుంటున్నారు?" అన్నాడు కిరణ్.

"ఇనస్పెక్టర్ శ్రీనివాస్ గారేనా మాట్లాడుతూంట! నేను విద్యను మాట్లాడుతున్నాను. రమేష్‌ను, సరళను హత్య చేసిందెవరో మీకు చెప్పాలి. మరోసారి మా యింటికి వస్తారా?" అన్నది అవతలి కంఠం.

"ఫోన్‌లో చెప్పకూడదా?" అన్నాడు కిరణ్.

"వద్దండి. మీరు దయచేసి మా యింటికి రండి. అన్నీ వివరంగా చెపుతాను!" అవతల ఫోను పెట్టేసిన చప్పుడు.

కిరణ్ శ్రీనివాస్ వంక తిరిగి, "మనం వెంటనే విద్య యింటికి వెళ్ళాలి! హంతకుల గురించి ఆమెకు తెలుసు. ఆమె యింటి అడ్రసు వుంది కదా!" అన్నాడు.

"ఉన్నది. అయితే యిప్పుడు యిదివరలో ఫోన్ చేసినది కూడా విద్యేనన్నమాట! నేను వినకుండా ఫోను పెట్టేశానిదివరలో" నొచ్చుకున్నాడు శ్రీనివాస్.

"మాటలు అనవసరం, పద పోదాం!" కిరణ్ పరుగు లాంటి నడకతో టయోటాను సమీపించాడు. శ్రీనివాస్ కూచుంటుండగానే ముందుకు దూకించాడు.

9

విద్య యింటికి వెళ్ళేసరికి అక్కడ చాలామంది గుమి గూడి వుండటం కనిపించింది.

కిరణ్, శ్రీనివాస్ వంక తిరిగి, "ఉన్న ఒక్క ఆధారమూ పోయింది. విద్యను కూడా చంపేశారు!" అన్నాడు.

శ్రీనివాస్ అతనివంక ఆశ్చర్యంగా చూశాడు.

ఇద్దరూ గుమ్మం యెక్కుతుండగా ఓ నడివయసామె పోలీసుల్ని చూసి భయపడి, "అమ్మాయి ఆత్మహత్య చేసుకున్నది బాబూ! మీకు ఫోన్ చేసి చెప్పాలనే అనుకున్నాం, యింతలో మీరే వచ్చారు!" అన్నది. ఆమె బలవంతాన కన్నీళ్ళు ఆపుకుంటోంది.

"అమ్మాయంటే ఎవరు?"

"విద్య—నా బిడ్డ బాబూ!" అన్నదామె.

"శవాన్ని చూపించండి" అన్నాడు కిరణ్ నడుస్తూనే. ఆమె లోపలికి నడిచింది.

మంచానికి అడ్డంగా పడివున్నది శవం. ఇరవై సంవత్సరాల అమ్మాయి. చాలా అందంగా వున్నది. ఆమె యింకా బతికే వుందన్న భ్రమ కలగజేస్తోంది.

శ్రీనివాస్ విద్య తల్లివైపు తిరిగి "మీ ఫోను ఒకసారి ఉపయోగించుకోవచ్చా?" అన్నాడు.

"మాకు ఫోను లేదు బాబూ!" అన్నదామె.

కిరణ్, శ్రీనివాస్ ఉలిక్కిపడి చూశారు.

"మీ అమ్మాయి పేరు విద్యే కదా?"

"అవును బాబూ!"

"పదిహేను నిమిషాల క్రితం మీ యింటినుంచి మీ అమ్మాయి ఫోన్ చేసింది మాకు! మీ పక్కింట్లో ఎవరి కైనా ఫోను వుందా?"

"ఈ వీధి చివర వున్న పత్రిక ఎడిటర్ గారింట్లో ఫోను వుందిగాని, మా అమ్మాయి గంటనుంచి బయటికే పోలేదు. ఆమె ఫోనుచేసే ప్రసక్తేలేదు!"

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలరు? అయిదు నిమిషాల్లో వెళ్ళి ఫోనుచేసి తిరిగి రావచ్చుకదా!"

"అరగంటక్రితం అమ్మాయి తలుపులు వేసుకుని లోపల పడుకున్నది. భోజనం చేసిన వెంటనే గదిలోకి వెళ్ళిపోయింది. అయితే అంతక్రితం ఆమెను భోజనం చెయ్యమని చెప్పటానికి చాలా సేపు బతిమాలవలసి వచ్చింది. అమ్మాయి లోపలికి వెళ్ళింతర్వాత నేను యిక్కడే గది బయట కుర్చీలో కూచుని వీక్లీ చదువు కుంటున్నాను.

ఇంతలో చాకలిది నీ గుడ్డలు వెయ్యటానికి అమ్మాయిని తలుపుతట్టి పిలిచాను. ఎంతకీ లేవకపోవటంతో నేను, చాకలి, పనివాడు కూడా చాలాసేపు తట్టాం. కాని తలుపులు తెరుచుకోలేదు. భయంవేసి కిటికీ పగలగొట్టి చూస్తే, మంచానికి అడ్డంగా పడుకుని కనిపించింది. పనివాడు కిటికీలోనించే గడియతీశాడు. తీరా లోనికొచ్చి చూసేసరికి అమ్మాయి చనిపోయి వున్నది!" ఆమె దుఃఖాన్ని ఆపుకోడానికి కాసేపు ఆగింది.

కిరణ్ పగిలిన కిటికీ తలుపుల్ని చూశాడు. ఆమె చెప్పింది నిజమే కావచ్చు. అయితే తమకు ఫోను చేసి తన పేరు విద్య అని చెప్పిన స్త్రీ ఎవరు? శ్రీనివాస్

చెప్పినట్లే ఆమె ప్రాక్టికల్ జోకరా? అలా అనుకుంటే మరి, విద్య ఇంటికి తమను ఎందుకు రమ్మని పిలుస్తుంది? విద్య చనిపోతుందని ఆమెకు తెలుసా? లేక విద్యను ఆమె హత్యచేసి తర్వాత ఫోన్ చేసిందా?

కిరణ్ మస్తిష్కం ఆలోచనలతో వేడెక్కింది.

శవం వంక పరీక్షగా చూశాడు. ఎక్కడా దేహం మీద గాయాలు లేవు. కాని నోటినుంచి రక్తం కారి పక్కమీదకు జారింది. అంటే ఆమె సైనేడ్ కాప్సుల్స్ మింగి ఆత్మహత్య చేసుకుని వుండాలి!

ఎందుకు ఆత్మహత్య చేసుకుంది? ఎవరైనా లోపలి కొచ్చి ఆమెకు బలవంతాన కాప్సుల్స్ మింగించి హత్య చేసే అవకాశంలేదు! ఆ గదికి రెండో తలుపులేదు! ఉన్నది ఒకటే ద్వారం. ఆ ద్వారం ముందు కుర్చీ వున్నది. విద్య తల్లి ఆ కుర్చీలో కూచుని వున్నమాట అబద్ధం కాదు! కుర్చీలో ఆ వారం వీక్లీ బోర్లాపడవేసి వున్నది!

ఇంతలో అతనికేదో గుర్తొచ్చి అడిగాడు. "మీరిప్పుడు విషయం చెపుతూ, భోంచేయమని బతిమాలవలసి వచ్చిందని చెప్పారు. అంటే యింట్లో ఏమైనా ఘర్షణ పడ్డారా?" అని.

"అబ్బే, అదేంలేదు బాబూ! అమ్మాయి వాళ్ళ క్లాసు కుర్రాడ్ని ప్రేమించింది. ఆ కుర్రాడ్ని ఎవరో చంపేశారు—అప్పట్నుంచీ అమ్మాయి తిండి తినదు. నిద్ర పోదు! విచారంతో కుమిలిపోతోంది. అందుకే బతిమాలి కొంత ఎంగిలిపడేలా చేశాను!" అన్నదామె.

ఈలోపల శ్రీనివాస్ వీధి చివర పత్రిక ఎడిటర్ గారింటినుంచి హెడ్‌క్వార్టర్సుకి ఫోన్ చేసి వచ్చాడు—

సిబ్బందిని పంపించమని చెప్పి.

కిరణ్, విద్య గదిని పరిశీలనగా చూశాడు. టేబిలు, గాడ్రెజ్ కుర్చీ, టేబిల్ లైటు, ఆమె పడుకుని వున్న మంచం, మూలన విడిచిన గుడ్డలు—యివే వున్నాయి గది నిండా. బహుశా ఆ గుడ్డల గురించే చాకలికి వెయ్యటానికి విద్య తల్లి తలుపు కొట్టి వుంటుంది! ఏ విధంగా చూసినా విద్య తల్లి అబద్ధం చెప్పటం లేదనిపించింది కిరణ్‌కు.

"ఈ యింట్లో యెవరెవరుంటున్నారు?" అడిగాడామెను.

"నేను, మావారు, విద్య, విద్య అన్న రఘు, పనివాడు, వంటమనిషి — ఆరుగురం! వంటమనిషి రోజూ రెండు పూటలా వంట చేసి వెళ్ళిపోతుంది. పనివాడు మాత్రం రాత్రింబవళ్ళు యిక్కడే వుంటాడు."

"మీవారేం చేస్తున్నారు?"

"స్పాంజ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీలో సీనియర్ అకౌంటెంటు. సంగతి ఫోన్ ద్వారా చెప్పాం — ఆ ఎడిటర్ గారింటినుంచే ఫోన్ చేసి. వస్తూ వుంటారు."

"మీ అబ్బాయి రఘు ఏం చేస్తున్నాడు?"

"వాడు పాలిటెక్నిక్ పాసయ్యాడు. ప్రస్తుతం సనత్ నగర్లో ప్రయివేట్ కంపెనీలో అప్రెంటిస్‌గా పనిచేస్తున్నాడు. వాడుకూడా ఆరుగంటలవరకు యింటికి తిరిగిరాడు!"

కిరణ్ ఆమెతో మాట్లాడుతునే ఇల్లంతా పరిశీలనగా చూస్తున్నాడు. ఎక్కడో మెలిక వుంది. కాని లింక్ అందటంలేదు.

విద్య అంతక్రితమే భోజనం చేసి గదిలోనికి వెళ్ళి

అంతలోనే ఎందుకు ఆత్మహత్య చేసుకున్నది? రమేష్ చనిపోవటంతో జీవితంమీద విరక్తి చెందిందా? విరక్తి చెందివుండేందు కవకాశంలేదు. ఎందుకంటే తనమీద ఆశ పెట్టుకోవద్దని రమేష్ యిదివరకే ఆమెకు చెప్పటం, చెప్పించటం కూడా చేశాడు. విరక్తి కలిగితే అప్పుడే కలిగివుండాలి! కాని, అతను చనిపోయాక యిన్ని రోజులకు ఎందుకు విరక్తి కలుగుతుంది?

టేబిలుమీద, పక్కమీద, తలగడ దిండుకింద అన్ని చోట్లా వెతికాడు కిరణ్. ఆమె చనిపోతూ యెలాంటి కాగితమూ పెట్టలేదు. ఆమెకు డైరీరాసే అలవాటు లేనట్టుంది! గదిలో డైరీ ఏదీ కనిపించలేదు!

కిరణ్ కేదో స్ఫురించింది.

"మధ్యాహ్నం అమ్మాయికి భోజనం ఎవరు పెట్టారు?" అనడిగాడు విద్య తల్లిని.

"సాధారణంగా అందరికీ వంటమనిషే భోజనాలు పెడుతుంది బాబూ! అయితే యీ రోజు చాలాసేపు టేబిలుమీద అమ్మాయికి ఉద్దేశించిన భోజనం అలాగే వుండిపోయింది. ఈ రోజు నేను ఉపవాసం. అందుకని అమ్మాయి ఒక్కతెకు భోజనం టేబిలుమీద పెట్టి అమ్మాయి భోజనం చేసేవరకు వంటమనిషి దగ్గరే వుంది. తర్వాత కంచాలు కూడా కడిగేసి, మళ్ళీ వస్తానని ఇంటికి పోయింది! తన కూతురుకు బావుండలేదని వెళ్ళింది. వీలైతే సాయంత్రం వంటచెయ్యటానికొస్తానని వెళ్ళి పోయింది!"

"ఆమె ఎక్కడుంటుందో మీకు తెలుసా?"

"ఇల్లా బాబూ! మా అబ్బాయి రఘుకి తెలుసు. అన్నట్టు పనివాడిక్కూడా తెలుసు. పిలకమంటారా? ఆమె

యిల్లు దేనికి బాబూ!''

"కొంచెం పనుంది. పనివాడ్ని పిలవండి!"

పనివాడు వచ్చాక వాడినుంచి వంటామె యిల్లు గురించి అడిగి తెల్సుకున్నాడు కిరణ్.

"ఈ రోజు ఎవరైనా మోటారుసైకిలుమీద గాని, లేక మరేదైనా వాహనంమీద గాని వచ్చి వంటామె గురించి అడిగారా?" అనడిగాడు కిరణ్.

"ఉదయం ఎవరో ఒకాయన వచ్చారు బాబూ! ఎర్ర సైకిలు మోటారు. వంటామె కావాలని అడిగితే నేనే ఆమెను పిలిచి చెప్పానండి. అతనితో ఏదో మాట్లాడి లోపలికొచ్చాక ఎవరని అడిగానండి. తన కూతురుకు వంట్లో బావుండలేదని కబురు చెప్పటానికొచ్చాడని, తమ వీధిలోని ఉన్నవారి అబ్బాయని, ఉపకార బుద్ధితో తనకు కబురు చెప్పటానికొచ్చాడని, తన కూతురుకు పురుడువచ్చే రోజులనీ చెప్పింది!" అంది విద్య తల్లి.

"ఆ మోటరుబైకుమీద వచ్చిన కుర్రాడు యెలా వున్నాడు?"

"నల్లగా, ఎత్తుగా వున్నాడు బాబూ! బోడిమూతి. వయసు 20పైన వుంటుంది."

కిరణ్ శ్రీనివాస్ వంక సాభిప్రాయంగా చూశాడు. శ్రీనివాస్‌కి కొంత అర్థమై, కొంత కాకుండా వున్నది.

ఇంతలో పోలీసు డాక్టరు, ఫోటోగ్రాఫరు, వేలిముద్రల నిపుణుడు వచ్చారు.

కిరణ్ డాక్టరుతో, "ఆమెకు ఆహారంలో విషం కలిపారు. బహుశా సైనేడ్. నోటి చివర్ల నుంచి రక్తం కనిపిస్తోంది. దాన్నిబట్టి వూహిస్తున్నాను" అన్నాడు.

డాక్టర్ తలూపి, "యు మే బి రైట్! ఆహారం తిని

ఎంతో సేపు కాలేదంటున్నారు కాబట్టి, పోస్టుమార్టంలో అన్ డైజెస్టెడ్ ఫుడ్ పార్టికల్స్‌లో తెలిసిపోతుంది! డెఫినిట్లీ యిటీజ్ పైనేడి! కాకపోతే రక్తనాళాలు తెగే ప్రసక్తిలేదు!" అన్నాడు.

కిరణ్ శ్రీనివాస్ వంక తిరిగి, "నేను ఓ అరగంట తర్వాత స్టేషన్‌కొస్తాను. నువ్వీలోపల యిక్కడి తతంగం ముగించుకుని స్టేషన్‌కిరా!" అన్నాడు.

తర్వాత పనివాడి వంక తిరిగి, "నాతో రా!" అన్నాడు కిరణ్ బయటికి దారితీస్తూ.

10

"వంటమనిషి పారిపోయింది! విద్యుత ఆహారంలో విషం కలిపినది ఆమే! అయినా హంతకుడు తెలిసిపోయాడు. విద్యుత అడ్డు తొలగించటానికి హంతకుడు వంటామెను ఉపయోగించుకున్నాడు. నిజానికి వంటామెకు కూతురు లేదు, ఆమెకు పురుడూ రాలేదు! నువ్వు వెంటనే ఆమె గురించి అన్ని స్టేషన్స్‌కీ రిపోర్టు పంపించు! ఇంకా నగరంలో వుంటే ఓ ముఖ్యమైన సాక్షి దొరుకుతుంది.

హంతకుడు-మనోరమ అన్నయ్యను వెంటనే ఆ మోటర్ బైక్‌తో స్వాధీనం చేసుకో! ప్రస్తుతం అతను విజయవాడలోని మధురమ హోటల్లో వుంటున్నట్టు చక్కటి ఎలిబీ కూడా సృష్టించుకుని వున్నాడు" అన్నాడు కిరణ్.

"హంతకుడు మనోరమ అన్నయ్యా? అంటే రమేష్ స్నేహితురాలు మనోరమ అన్నయ్యా? అసలు మనోరమకో అన్నయ్య వున్నట్టు నీకెలా తెలుసు? విజయవాడ హోటల్లో వుండటమేమిటి? అంతా అయోమయంగా వుంది!" అన్నాడు శ్రీనివాస్.

"చెపుతాను విను. నీ దగ్గర్నుంచి సరాసరి విద్యా

వాళ్ళ వంటామె యింటికి వెళ్ళాను. ఆమె యెన్నడూ చెయ్యని తప్పు చేయటంతో పోలీసులు వచ్చేరని తెలిసే సరికి టెన్షన్, భయం, భరించలేక ఎక్కడికో పారి పోయింది.

"ఆ తర్వాత విద్య స్నేహితురాళ్ళు విశాల, మనోరమల యిళ్ళకు వెళ్ళాను. ఎంక్వయిరీలో విశాలకు అన్నయ్యలు గాని, తమ్ముళ్ళుగాని ఎవరూ లేరని తెలిసింది. ఆమె యింట్లో ఫోన్ కూడా లేదు. హత్యా ప్రదేశంలో దొరికిన యూత్ పెన్ను కావాలనే కనిపించేలా పట్టుకుని ఏదో రాస్తూన్నట్టు నటించాను. ఆమె ముఖంలో ఎలాటి భావము కన్పించలేదు. కాని మనోరమతో మాట్లాడుతూ అలాగే నటించాను. ఆమె పదేపదే ఈ పెన్ వంకే చూడటం గమనించాను. ఆమె ముఖంలో రంగులు మారాయి. పెన్ను రమేష్‌దేమో చూసి చెప్పమన్నాను. అతని హత్య జరిగిన ప్రదేశంలో దొరికిందని చెపుతూ కావాలనే ఆమె చేతికి తాకించబోయాను. షాక్ తిన్నట్టు చేతిని వెనక్కు లాగేసుకున్నది. అంటే ఆమెకు ఆ పెన్‌లో సైనేడ్ వున్నట్టు తెలుసు! ఆ చర్యే ఆమెను పట్టిచ్చింది. ఆమె యింట్లో ఫోన్ వున్నది. ఎదురుగా ఆమె అన్న ఫోటో టేబిల్ మీద కనిపించింది. మీసం, గడ్డం ఫాషన్‌గా కత్తిరించుకుని వున్న ఫోటో! ఇదిగో ఆ ఫోటో!" అంటూ ఫ్రేం ఫోటోను శ్రీనివాస్‌కి అందించాడు కిరణ్.

శ్రీనివాస్ ఫోటో వంక ఆశ్చర్యంగా చూశాడు.

"అదే చెప్తున్నాను. ఈ ఫోటో చూడగానే సరళ పక్కింటామె చెప్పిన మాటలు గుర్తువచ్చాయి. ఫాషన్‌గా గడ్డం, మీసం కత్తిరించుకున్న అబ్బాయిని చూశానని

ఆమె చెప్పింది కదా! ఎవరని అడిగాను మనోరమను. తన అన్నయ్య అనీ వారం రోజులుగా విజయవాడలో కేంప్ మీద ఫలానా హోటల్లో వున్నాడనీ, తన అన్నయ్య సేల్స్‌మాన్ అనీ చెప్పింది. హోటల్స్‌తో పాటు అంత ఖచ్చితంగా ఆమె చెప్పటం కూడా నా అనుమానాన్ని బలపరించింది.

“వెంటనే గాల్లోకి బాణం వదిలాను. విద్యను హత్య చేశారని, వంటామె ద్వారా విషప్రయోగం చేశారనీ, వంటామె ఎవరు తనను హత్యకు పురికొలిపారో చెప్పేసిందనీ అన్నాను.

“అంతే! ఆమెకు ఒక్కసారిగా ముచ్చెమటలు పోశాయి. కుర్చీలో కూచోలేకపోయింది. వెంటనే నా జేబునుంచి పెన్ను లాక్కొని నన్ను గుచ్చబోయింది. వెంటనే సందిట బంధించి లాక్కొని వచ్చి కార్లో పడేశాను. నీవు రాకముందే మీ సార్జంటు శివాని కప్పగించాను. ఆమెనుంచి స్టేట్ మెంటు తీసుకో!” అని ముగించాడు కిరణ్.

శివం, మనోరమకు అరదండాలు తగిలించి వారిముందు నిలబెట్టాడు. శ్రీనివాస్ ఆమె వాఙ్మూలం రికార్డుచేశాడు.

“నాకు మొదట్నుంచీ రమేష్ అంటే చాలా ప్రేమ. కాని రమేష్‌కు నేనంటే యిష్టంలేదు. విద్యంటే ఇష్టం! మా అన్న విజయ్‌కు సరళంటే ప్రాణం. కాని సరళ రెండు సార్లు మా అన్నను విదిల్చికొట్టి బాగా మందలించింది.

“నాకు రమేష్‌మీద, మా అన్నకు సరళమీద కసి, ద్వేషం ఏర్పడ్డాయి. నాకు దక్కని రమేష్ యెవరికీ దక్కకూడదు! మా అన్నకు చెప్పాను రమేష్ పని ముగించమని. మా అన్న నా పెన్ తీసుకుని దాంట్లో

సైనేడ్ నింపాడు. నేను దేనికని అడిగితే చెప్పాడు. దాంతో రమేష్‌ని చంపేశాడు. ఆ రోజు రెండో ఆట సినిమాకు రమేష్ వెళ్ళిన సంగతి మా అన్నతో నేనే చెప్పాను. వెంటనే తన ప్లాను అమలు చేశాడు.

"మరునాడు సరళను కూడా సైనేడ్ యింజక్టు చేసి చంపేశాడు. అయితే అదే సమయానికి విద్య సరళ ఇంటికొచ్చి మా అన్నయ్య హడావిడిగా మోటరుబైక్ మీద పారిపోవటం చూసిందట. సరళ చనిపోయి వుండటం చూసి భయపడి పారిపోయిందట! మా అన్న సరళను చంపినట్టు విద్య గ్రహించిందని మా అన్న భయపడుతూ నాతో చెప్పాడు. అప్పటికే విజయవాడ హోటల్లో తనుంటున్నట్టు ఎలిబీ సృష్టించుకుని, ఎవరిదో ఎర్ర ఎన్‌ఫీల్డు బైక్ దొంగిలించి తిరుగుతున్నాడు అన్నయ్య.

"ఇనస్పెక్టర్ శ్రీనివాస్‌కి రకరకాలుగా గొంతుమార్చి రమేష్ శత్రువుల పేర్లు చెప్పి వాళ్ళే రమేష్‌ని చంపినట్టు చెప్పాడు. నన్ను కూడా ప్రేరేపించి, సరళను విద్య చంపినట్టు చెప్పమన్నాడు. కాని ఇనస్పెక్టర్ నా మాట వినకుండా ఫోన్ పెట్టేశాడు.

"అయితే విద్య తన అనుమానం విషయం తన అన్న రఘుతో చెప్పేసింది. అతను నన్ను బ్లాక్ మెయిల్ చేయసాగాడు. రహస్యాన్ని దాచటానికి నేను తనతో గడపాలని కోరాడు. మా అన్న విద్య వాళ్ళ వంటామెను వశపరచుకుని, విద్యకు, రఘుకు విషప్రయోగం చెయ్యమని ప్రయోగించాడు. వంటామె తనపని సగం మాత్రమే పూర్తిచేసింది. ఈలోపల నేను దొరికిపోయాను!" అని చెప్పింది మనోరమ.

—:అయిపోయింది:—